


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 187 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం శనివారం 18 జూలై 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 187 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM SAT 18 JULY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
- పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ

- మిగతా 2లో






## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది... అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:“హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది”

- మిగతా 2లో



## యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రుతుపవనాల ముప్పును ప్రస్తావించిన ఆర్‌బీఐ గవర్నర్
- అయినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని మల్హోత్రా ధీమా
- రూపాయి పరిస్థితి సహజమేనని వివరణ
- వాణిజ్య ఒప్పందాలు ఎగుమతులకు ఊతమిస్తాయని భరోసా
- రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని వెల్లడి

- మిగతా 2లో

## అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి



### మంత్రి నారాయణ డెడ్‌లైన్!

- అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం
- అమరావతిలో రోడ్లు, భవనాలు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్టులు పూర్తి కావాలన్న నారాయణ
- పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు

- మిగతా 2లో

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- పట్టిసీమను జగన్ వట్టిసీమ అన్నారన్న దేవినేని ఉమా
- జగన్ అధికారంలోకి వచ్చాక అదే పట్టిసీమ ద్వారా నీరు ఇవ్వాల్సి వచ్చిందని ఎద్దేవా
- పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:గంగా–కావేరి నదుల అనుసంధానంపై డాక్టర్ కేఎల్ రావు కలగన్నారని... ఆ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు గోదావరి–కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. గతంలో జగన్ పట్టిసీమను ‘వట్టిసీమ’ అని విమర్శించారని... ఆయన పాలనలో అదే పట్టిసీమ ద్వారా

- మిగతా 2లో




## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

### నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

- నరసరావుపేటలో బ్యాంకుల రుణమేళా
- హాజరైన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- 2014కు ముందు తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేవారన్న నిర్మల
- ప్రస్తుతం అర్హత ఆధారంగానే రుణాలు ఇస్తున్నట్టు వెల్లడి
- వీధి వ్యాపారులకు ప్రభుత్వమే గ్యారెంటీగా నిలుస్తోందని స్పష్టీకరణ

- మిగతా 2లో





## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- త్వరలోనే మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న సంజయ్ రౌత్
- ఫడ్నవీస్‌కు కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు ఇస్తారని జోస్యం
- మహారాష్ట్రకు బీజేపీకి చెందిన మరోనేత సీఎం అవుతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దుమారం రేపేలా శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గం ఫైర్‌బ్రాండ్ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ త్వరలోనే తన పదవికి రాజీనామా

- మిగతా 2లో

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు
- కాగితం నోట్ల కంటే ఎక్కువ మన్నిక, భద్రత కలిగిన పాలిమర్ నోట్లు
- ప్రస్తుత కాగితం నోట్లు యథావిధిగా చలామణి
- 2027 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే అవకాశం

పెన్ పవర్ డెస్క్: దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో



## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత




- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి

పెన్ పవర్ డెస్క్:మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# పొత్తులే కత్తులుగా మారతాయా? చంద్రబాబుకు అతి పెద్ద ఛాలెంజ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన ఛాలెంజ్ ను ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదీ ప్రత్యర్థి వైసీపీ నుంచి మాత్రం కాదు. కేవలం సొంత పార్టీలోని నేతల నుంచే. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికే నాయకత్వంలో గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. పదవుల కోసం పోరాడి.. పోరాడి రెండేళ్ల నుంచి అలసి పోయి ఉన్నారు. వారందరినీ ఒక చోట చేర్చి అందరినీ మెప్పించి ఒక బాటలో పయనించేలా చేయడం కత్తిమీద మీద సామే అవుతుందని మాత్రం చెప్పాలి. ముఖ్యంగా కూటమి పార్టీలోని మిగిలిన మిత్ర పక్షాలు గెలిచిన స్థానాల్లోనూ ఎవరి మధ్య సఖ్యత లేదు. ఎవరి దారి వారిదే లాగా ఉంది.

**పొత్తులో భాగంగా...**

ఇప్పటికే పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటును కోల్పోయిన తమకు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఛైర్మన్ పదవులను ఖచ్చితంగా మిత్ర పక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ చార్జులు డిమాండ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే అక్కడ ఉన్న ఎమ్మెల్యే అందుకు ఒప్పుకునే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా అనుమానమే. వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ స్థానిక నేతల నుంచి చంద్రబాబు ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఎమ్మెల్యే సీటు తమకు ఇవ్వకపోయినా తాము కూటమి ధర్మాన్ని పాటించి మద్దతు ఇచ్చి గెలుపులో ముఖ్యపాత్ర వహించినప్పటికీ, గెలిచిన తర్వాత మాత్రం తమను పట్టించుకోవడం లేదని అనేక నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

**పదవుల కోసం ఘర్షణలు...**

ఇటీవల తిరుపతి పట్టణంలో జరిగిన తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గంలోనే ఇన్ ఛార్జి పదవి కోసం నేతల తరుపున కార్యకర్తలు ఘర్షణలకు దిగడాన్ని చూశాం. ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాజీ పడకపోవచ్చు. వీరందరినీ సముదాయించడం చంద్రబాబుకు ఆషామాషీ కాదు. అలాగని జిల్లా ఇన్ ఛార్జి మంత్రులపై ఈ భారాన్ని మోపితే వారు ఒత్తిడికి గురయి వదిలేస్తారు. నారా లోకేశ్ చేయి వేసినా వారందరినీ ఒక బాటలో పయనించేలా చేయడం కష్టంగానే కనిపిస్తుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు అధికారంలో ఉన్న చంద్రబాబుకు అతి పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ఒకవేళ మిత్ర పక్షాలకు ఇచ్చిన చోట ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి ఉండదు. మరి ఈ పరిస్థితి నుంచి పార్టీని ఎలా బయటపడేస్తారన్నది చూడాలి.

# వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- మొదటి పేజి తరువాయి

మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

# అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

- మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభు త్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నదీ తీరాన 'రివర్ ఫ్రంట్ టూరిజం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఏడీసీఎల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు.

**ఈ సమీక్షా సమావేశం ముఖ్యాంశాలు:**

పీపీపీ విధానంలో పార్కుల అభివృద్ధి: అమరావతిలో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా భారీ 'అమ్యూజ్‌మెంట్ పార్క్', పర్యావరణాన్ని ప్రతిబింబించేలా 'ఎకో టూరిజం పార్కు'లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది.

మంత్రి నారాయణ డెడ్‌లైన్: రాజధాని పరిధిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చే సమయానికే.. సమాంతరంగా ఈ పర్యాటక ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి కావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సీఎం చంద్రబాబు విజన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్ డిజైన్లు ఉండాలని, పనుల్లో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు.రైతులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు తీసుకున్న ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా కాలయాపన చేయకుండా తక్షణమే తమ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. తాజా సమీక్షతో అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు మరింత ఊపు రానుంది.

# త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- మొదటి పేజి తరువాయి

చేసి, ఢిల్లీ బాట పట్టబోతున్నారంటూ ఆయన జోస్యం చెప్పారు. రాబోయే ఒకటి లేదా రెండు నెలల్లో కేంద్రంలో మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. సీఎం ఫడ్నవీస్‌ను ఢిల్లీకి పిలిపించి కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని, ఆయన స్థానంలో బీజేపీకి చెందిన ఒక సీనియర్ నేతను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. శివసేన (ఖదీ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న 'రామ రక్షా ఆందోళన్' సన్నాహకాలను పర్యవేక్షించేందుకు నాగ్‌పూర్ వెళ్లిన సంజయ్ రౌత్.. అక్కడి నుంచే ఈ పొలిటికల్ బాంబ్ పేల్చారు.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఎన్పీఏ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బలహీన రుతుపవనాల ముప్పు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వేచి చూసే ధోరణిని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. దూరదర్శన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ యుద్ధం తర్వాత అమెరికా డాలర్ బలపడిందని మల్హోత్రా తెలిపారు. దీంతో అనేక దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయని చెప్పారు. ప్రపంచ పరిస్థితులతో పోలిస్తే రూపాయి విలువలో వచ్చిన మార్పు సహజంగానే ఉందని స్పష్టం చేశారు. రూపాయి పనితీరుపై ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.భారత విదేశీ వాణిజ్యం బలంగానే కొనసాగుతోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. సేవల ఎగుమతులు, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి వచ్చే నగదు, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్, అమెరికాతో కొనసాగుతున్న చర్చలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని వివరించారు.సరఫరా సంబంధిత కారణాల వల్లే ఇటీవల ద్రవ్యోల్బణం పెరిగిందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం

4 శాతం పరిధిలోనే ఉందని చెప్పారు. ధరల స్థిరత్వంతో పాటు ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యం కాపాడే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందుకే ఈ ఏడాది ఇప్పటివరకు కీలక వడ్డీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించినట్లు పేర్కొన్నారు.అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయని మల్హోత్రా గుర్తుచేశారు. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తాజా ఆర్థిక పరిస్థితులను సమీక్షించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

# మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళానే దానికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించాయని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

# జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- మొదటి పేజి తరువాయి

నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యంగ్యంగా అన్నారు. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని చెప్పారు.

పట్టిసీమ, అమరావతి నిర్మాణాల్లో జగన్ అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో పట్టిసీమ పనులు ప్రారంభించి, సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు నీరందించారని తెలిపారు. పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని అన్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు సారవంతంగా మారి, ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు

పెరిగిందన్నారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి రైతుల ఆదాయం పెరిగిందని, రాయలసీమ నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని ఉమా వివరించారు.

# మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత

- మొదటి పేజి తరువాయి

దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి.

"మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు.

గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్లు దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.

దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- మొదటి పేజి తరువాయి

అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహా స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# బొకేయాగూడ, గవిలిగూడలో పోలీస్ అవగాహన సదస్సు

- యువత గంజాయి సాగు, రవాణా, ఆన్లైన్ సైబర్ మోసాలు దూరంగా ఉండాలి.
- పోక్సోచట్టం బాల్య వివాహ నిరోధక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.
- జి మాడుగుల సిఐ లక్ష్మణరావు, స్థానిక ఎస్సై పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 17.**గంజాయి సాగు రవాణ, ఆన్ లైన్ సైబర్ మోసాలు, చట్ట వ్యతిరేక పనులకు ప్రజలు ముఖ్యంగా యువత దూరంగా ఉండాలని జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు అన్నారు. మండల పరిధిలో గల మారుమూల లక్ష్మీపురం పంచాయతీ, బొకేయగూడ, గవిలిగూడ గ్రామాల్లో ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీ మాడుగుల సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ.. గంజాయి సాగు, రవాణా ఆన్‌లైన్ సైబర్ మోసాలు మరియు చట్టవ్యతిరేక పనులకు విద్యార్థులు, యువత, ప్రజలు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. పోలీస్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగ అవకాశం పొందే అర్హతను శాశ్వతంగా కోల్పోతారని హెచ్చరించారు. ఈ సదస్సులో మహిళల రక్షణ, పోక్సోచట్టం, బాల్య వివాహాల నిరోధం, మైనర్ డ్రైవింగ్ నివారణ మరియు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు, యువతకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజన ప్రజలు, పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పూరి జగన్నాథ స్వామి రథయాత్రలో జగన్ దంపతులు

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జులై 17** పూరి జగన్నాథ స్వామి రథయాత్రలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం. లక్ష్మి దంపతులు పాలుగొన్నారు . స్వామివారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఒడిశాలోని పూరీలో జగన్నాథ రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి చెందింది. శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి తమతమ దివ్య రథాలపై కొలువై, గుండిచా ఆలయానికి ఊరేగింపుగా వెళతారు. ఈ రథయాత్ర ఆషాఢ మాసంలో మొదలై తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో గొంతెన నర్సింగరావు. ఎస్ వెంకటరమణ.



తదితరులు పాల్గొన్నారు

# కోవిడ్‌కు విమ్స్ పూర్తి సన్నద్ధం







- భయపడాల్సిన అవసరం లేదు.. కొత్త వేరియంట్ తీవ్రత తక్కువే
- 18 పడకల ఐసోలేషన్ వార్డు సిద్ధం -- మందులు, పరీక్షలు, వైద్య బృందం అందుబాటులో
- విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి మన్మధరావు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 17:** రాష్ట్రంలో అక్కడక్కడా కోవిడ్-19 కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అయితే ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని విశాఖ విమ్స్ డైరెక్టర్ డా. మన్మధరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న కొత్త కోవిడ్ వేరియంట్ తీవ్రత తక్కువగా ఉండి, సాధారణ ఫ్లూ తరహా లక్షణాలతోనే ఎక్కువ మంది కోలుకుంటున్నారని తెలిపారు. విశాఖలో కలెక్టర్ ఆఫీస్ అఫీషియల్ కాలనీలో ఒక వ్యక్తికి కోవిడ్ నిర్ధారణ కాగా, ఆయన హోమ్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పరంగా ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, డైరెక్టర్ విష్ణువర్ధన్,ఆదేశాల మేరకు పదిరోజుల క్రితమే

విమ్స్‌లో 18 పడకల ప్రత్యేక కోవిడ్ ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్లు తెలిపారు. వైద్యులు,నర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులు,పీపీఈ కిట్లు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు, ఆర్టీపీసీఆర్ పరీక్షల సామగ్రి, అవసరమైన మందులు అన్నీ సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు.

కోవిడ్ లక్షణాలతో వచ్చే రోగులను వెంటనే చేర్చి చికిత్స అందించేందుకు ఆసుపత్రి అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. గతంలో వచ్చిన మొదటి, రెండో దశలతో పోలిస్తే ప్రస్తుతం ఉన్న వేరియంట్ ప్రమాదకరం కాదని, అయినప్పటికీ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అవసరమైతే పరీక్షల సంఖ్యను కూడా పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డా. మన్మధరావు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని, అనవసర! భయాలకు గురికావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.





# కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదు

## 'తల్లికి వందనం'పై సీఎం స్పష్టత ఇవ్వాలి: బొత్స సత్యనారాయణ



**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై17:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పక్కన పెట్టి ప్రజలను మోసం చేస్తోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

**తల్లికి వందనంలో కోతలు**

వైసీపీ ప్రభుత్వం తెచ్చిన 'అమ్మఒడి'కే పేరు మార్చి 'తల్లికి వందనం' అని కూటమి కొనసాగిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15,000 ఇస్తామన్నారని, కానీ ఇప్పుడు రూ.13,000 మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు.

ఎస్సీ, బీసీ విద్యార్థులకు పూర్తి డబ్బులు ఇవ్వకుండా అరకొరగా ఇస్తున్నారని, చాలా మందికి బ్యాలెన్స్ ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. బడ్జెట్‌లో కూడా కేటాయింపులు తగ్గించారని ఆరోపించారు.

**విద్యావ్యవస్థ గందరగోళం**

'నాడు-నేడు' పనులు నిలిచిపోయాయని, ఇప్పుడు విరాళాల కోసం ఎదురుచూస్తున్నారని విమర్శించారు. పాఠశాలలు తెరిచి చాలా నెలలైనా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇంకా అందలేదన్నారు. ఇంగ్లీష్ మీడియం, టోఫెల్ శిక్షణ, స్పెషల్ టీచర్ల విధానం వంటివన్నీ ఎత్తేశారని అన్నారు.

**ఉత్తరాంధ్రలో దోపిడీ**

ఉత్తరాంధ్రలో గీతం భూములు, పంచదార కొండను కూటమి నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు పెద్ద ఎత్తున ఉన్నాయని చెప్పారు. అమరావతి పేరుతో దోపిడీ జరుగుతోందని విమర్శించారు.

**మానవత్వంపై రాజకీయం వద్దు**

జగన్ బాధితులను పరామర్శిస్తే 'శవరాజకీయం' అనడం సరికాదన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని, ఈసీ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి నేతల అరాచకాలను నమోదు చేసేందుకు వైసీపీ ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని వెల్లడించారు.

చివరగా 'తల్లికి వందనం' అమలుపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని బొత్స డిమాండ్ చేశారు.

# 82 ఏళ్ల వృద్ధునికి అందని పించను

- కొత్త రేషన్ కార్డు మంజూరు చేసి వృద్ధాప్య పెన్షన్ అందజేయాలి
- కాంగ్రెస్ పార్టీ ఆదివాసి రాష్ట్ర వైస్ చైర్మన్ వెగండ నీలకంఠం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 17.**మండలంలోని సుజనకోట పంచాయతి, సుజనాకోట గ్రామానికి చెందిన పాంగి రాజయ్యకు 82 ఏళ్ల వయసు అయిన వృద్ధాప్య పింఛను రాలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసి వైస్ చైర్మన్ వెంగడ నీలకంఠం అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అయిన మాట్లాడుతూ.. గత 2020 నుండి వృద్ధాప్య పెన్షన్ కు నోచుకోక రాజయ్య వృద్ధాప్యంలో అర్ద ఆకలితో అలమటిస్తున్నారన్నారు. గతంలో రాజయ్యకు పెన్షన్ వచ్చేదని అయితే రాజయ్యకు ఆయన తమ్ముడికి పెళ్లిళ్లు కాలేదనీ, దీంతో ఇద్దరు అన్నదమ్ములు వేరు వేరుగా ఉంటున్నా, అధికారుల తప్పుడు సర్వే వల్ల రేషన్ కార్డు తమ్ముడి పేరుతో ఉండటాన్ని గమనించిన సంబంధించిన అధికారులు ఆకార్డులో రాజయ్య పేరు కూడా ఉందని కారణం చూపి రాజయ్య వచ్చే పెన్షన్ ను 2020 మార్చి నుండి తొలగించారన్నారు. కానీ అదే కార్డులో ఉన్న తమ్ముడికి మాత్రం పెన్షన్ కొనసాగిస్తున్నారు. పెద్ద అయిన రాజయ్య 82 సంవత్సరాల వృద్ధుడికి మాత్రం ఎటువంటి పెన్షన్ గాని ఆదాయం గానీ ఏమీ లేవన్నారు. దీంతో రాజయ్య వయసు మీరీ ఏ పని చేయలేని దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు దాటిన ప్రతి పేద వృద్ధుడికి విడిగా పెన్షన్ ఇవ్వాలి కావున అల్లూరి జిల్లా కలెక్టర్, మండల అభివృద్ధి అధికారి వెంటనే స్పందించి రాజయ్యకు ప్రత్యేక రేషన్ కార్డు మంజూరు చేసి పెన్షన్ అందించాలని నీలకంఠం డిమాండ్ చేశారు. రాజయ్యకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ పార్టీ తరపున ఆందోళన చేపడతామన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మేభాలో సీసీ రోడ్డు నిర్మించాలి

- సిసి రోడ్డు లేక బురదలోనే రాకపోకలకు గ్రామస్తుల ఇబ్బందులు.
- సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు.
- టిడిపి నాయకుడు చెండా బాపూజీ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 17.**మండల పరిధిలో గల మాకవరం పంచాయతీ, మేభా గ్రామంలో సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు టిడిపి నాయకుడు చెండా బాపూజీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మేభ గ్రామంలో కొన్ని వీధుల్లో సిసి రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురద మాయమైన రోడ్డులోనే గ్రామ ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారని అన్నారు. వీధుల్లో సిసి రోడ్డు నిర్మించాలని, సిసి రోడ్డు లేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. గ్రామంలో 160 కుటుంబాలకు గాను సుమారు 450 మంది జనాభా కలిగి ఉన్నారని, పెద్ద గ్రామం కావటంతో సుమారు 600 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణానికి అవసరమై ఉందని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తానే మేభలో సిసి రోడ్డు నిర్మాణానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్, బిర్సా, సీతారాం, కామేష్, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతిపై ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన మారతమ్మ





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూలై 17:** అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్)గా పదోన్నతి పొందిన టి. మారతమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మలను వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్, ప్రాజెక్టు అధికారి ఆమెకు అభినందనలు తెలియజేస్తూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు కృషి చేయాలని సూచించారు.టి. మారతమ్మ గతంలో పాడేరు ఐటీడీఏలో స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా సుదీర్ఘకాలం సేవలందించారు. అనంతరం రాజవొమ్మంగి (ఆర్‌సీ వారం) ఐటీడీఏలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం ఆమెకు పదోన్నతి కల్పించి పాడేరు ఐటీడీఏలో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్)గా నియమించింది.ఈ సందర్భంగా మారతమ్మ మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, అధికారుల సమన్వయంతో గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు.

## నేడు జరిగే( శుక్రవారం) వైయస్సార్ పార్టీ మహిళా సదస్సు విజయవంతం చేయాలి.

మహిళా సదస్సుకు చింతపల్లి నుంచి పయనం.



**చింతపల్లి పెన్ పవర్ జూలై 17.** నేడు( శుక్రవారం) అరకు లోని వి రిసార్ట్స్ లో జరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా సదస్సు విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షులు ఉమ్మడివిశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి చింతపల్లి నుంచి ఎంపీపీ కోరాబు అనూష దేవి ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీ చైర్పర్సన్ ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా కార్యక్రమానికి పయనమయ్యారు. నియోజకవర్గంలోని వైయస్సార్ పార్టీ మహిళా కార్యకర్తలు అందరూ హాజరై మహిళా సదస్సు ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎంపీపీ అనూష దేవి కోరారు.

## పంట నమోదు చేసుకోవాలి: మండల వ్యవసాయ అధికారి సురేష్



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూలై 17:** 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని పెదవలస గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎన్.సురేష్ మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు.పంట నమోదు చేసుకోవడం ద్వారా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు పరిహారం పొందడంతో పాటు పంట రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెదవలస వ్యవసాయ సహాయకుడు నాగశంకర్, కాఫీ లైజన్ వర్కర్ లక్ష్మణరావు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పోతురాజు, గిరిజన వికాస్ వర్కర్ బాలకృష్ణతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 1/70 చట్ట పరిరక్షణకు పాడేరులో గిరిజనుల మహా గర్జన






- జీవో నెం.3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్
- ఏజెన్సీతో పాటు ఆంధ్ర--తెలంగాణ నుంచి వేలాదిగా తరలివచ్చిన గిరిజనులు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 17:** గిరిజన హక్కుల పరిరక్షణ, జీవో నెం.3కు చట్టబద్ధత కల్పించడం, 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో గురువారం భారీ గిరిజన ర్యాలీ నిర్వహించారు. సోషల్ మీడియా క్రియేటర్లు, గిరిజన సంఘాలు, యువజన సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీకి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.అరకు, పాడేరు, చింతపల్లి, అనంతగిరి, జి.కే.వీధి, హుకుంపేట, పెదబయలు, ముంచింగిపుట్టు తదితర ఏజెన్సీ మండలాల నుంచి వేలాదిగా గిరిజనులు, యువత, మహిళలు పాల్గొని పాడేరు పట్టణాన్ని నినాదాలతో హోరెత్తించారు. "జీవో నెం.3 అమలు చేయాలి", "1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి", "గిరిజన హక్కులను కాపాడాలి" అంటూ ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించారు.ర్యాలీలో పాల్గొన్న గిరిజన నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం జీవో నెం.3కు చట్టబద్ధత కల్పించి వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేసి గిరిజన భూములను పరాయీకరణ నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు, విద్య, ఉపాధి అవకాశాల్లో స్థానిక గిరిజనులకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ప్రభుత్వం గిరిజనుల న్యాయమైన డిమాండ్లపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ఏజెన్సీ వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.భారీ సంఖ్యలో గిరిజనులు పాల్గొనడంతో పాడేరు ప్రధాన వీధులు జనసంద్రంగా మారగా, ర్యాలీ ప్రశాంతంగా ముగిసింది.

## విశాఖ రైల్వే డీఆర్ఎంతో ప్రభుత్వ విప్ గణబాబు భేటీ



- పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు శుభవార్త
- రైల్వే సమస్యల పరిష్కారానికి కీలక ముందడుగు
- అండర్‌పాస్ వాక్‌వే, కొత్త రహదారుల అభివృద్ధిపై సానుకూల స్పందన
- వచ్చే వారం క్షేత్రస్థాయి పరిశీలనకు డీఆర్ఎం హామీ

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 17 :** స్థానిక విశాఖ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైల్వే సంబంధిత సమస్యల పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) విశాఖపట్నం రైల్వే డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బోహ్రాను మర్యాదపూర్వకంగా కలిసి పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులకు రైల్వే శాఖ అందించిన సహకారానికి గుర్తింపుగా డీఆర్ఎం లలిత్ బోహ్రాని విప్ గణబాబు శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధిలోని చాకలి గెడ్డ అండర్‌పాస్‌లో వాక్‌వే ఏర్పాటు, వెంకటాపురం అయిదు మాదాల వద్ద నూతన రహదారి నిర్మాణం, అలాగే వెంకటాపురం జనతా కాలనీలో ఒంటి మాదుం వద్ద రోడ్డు నిర్మాణానికి రైల్వే శాఖ సహకరించడంపై గణబాబు ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి నార్త్ సింహాచలం వరకు ఉన్న ప్రధాన రహదారిని ప్రస్తుతం ఉన్న 10 అడుగుల వెడల్పు నుంచి 40 అడుగులకు విస్తరించాలని గణబాబు డీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ రహదారిని నేరుగా వెంకటాపురం ప్రాంతానికి అనుసంధానం చేసేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే వెంకటాపురం, జనతా కాలనీ, పరిసర ప్రాంతాల ప్రజలకు సింహాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని వివరించారు. ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో బాజీ జంక్షన్ నుంచి సింహాచలం రైల్వే స్టేషన్ వరకు రైల్వే ట్రాక్ పక్కనే కొత్త రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని గణబాబు విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక అమృత భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చెందుతున్న సింహాచలం రైల్వే స్టేషన్‌లోకి నేరుగా ఆర్టీసీ బస్సులు ప్రవేశించేలా యాక్సెస్ కల్పించాలని, స్టేషన్ ప్రాంగణంలో బస్ హాల్ట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని డీఆర్ఎంను గణబాబు కోరారు. దీంతో ప్రయాణికులు బస్సు నుంచి నేరుగా స్టేషన్‌కు చేరుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. విప్ గణబాబు ప్రతిపాదించిన అన్ని అంశాలపై డీఆర్ఎం లలిత్ బోహ్రా సానుకూలంగా స్పందించారు. వచ్చే వారం ఇద్దరూ కలిసి సంబంధిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాధ్యాసాధ్యాలను అంచనా వేసి తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితే విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని వెంకటాపురం, జనతా కాలనీ, నార్త్ సింహాచలం, చాకలి గెడ్డ, బాజీ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన రహదారి అనుసంధానం, వేగవంతమైన రవాణా, రైల్వే స్టేషన్‌కు సులభ రాకపోకలు, ట్రాఫిక్ సమస్యల తగ్గింపు వంటి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం--రైల్వే శాఖల మధ్య సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## రేవళ్లు పీసా కమిటీ ఉపాధ్యక్షులుగా పాంగి రామారావు

కార్యదర్శిగా గతంలోనే ఎన్నికైన లువ్వా నూకరాజు



**కొయ్యూరు,పెన్ పవర్ జూలై 17:** శుక్రవారం మండలంలోని రేవళ్లలో నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్షుడుగా పాంగి రామారావు ఎన్నికయ్యారు. గతంలో మూడు దఫాలుగా గ్రామంలో పీసా కమిటీ ఎన్నిక నిర్వహించినప్పటికీ కార్యదర్శిగా లువ్వా నూకరాజు ఎన్నికైన తర్వాత, ఉపాధ్యక్ష ఎన్నిక కోరం లేక వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు శుక్రవారం నాలుగో దఫా నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో ఎట్టకేలకు ఉపాధ్యక్షులుగా పాంగి రామారావు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్ బాబు, ఎన్నిక నిర్వహణ అధికారిగా ఏఎస్ఓ చైతన్య, అలాగే ఎస్ఎంఐ జెయి రామకృష్ణ, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### మూడవ రోజుకు చేరిన శాంతి యుత నిరసన...!

న్యాయం కోసం బాధితుల ఆందోళన...



**కొయ్యూరు,పెన్ పవర్ జూలై 17:** కొయ్యూరు మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన కార్యక్రమం నేటికి మూడవ రోజుకు చేరుకుంది. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు కాకురు లోవదేవి, కాకురు సుధారాణి చేపట్టిన ఈ శాంతియుత నిరసన ఉధృతంగా కొనసాగుతోంది.

గత మూడు రోజులుగా ఎండను సైతం లెక్కచేయకుండా ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఈ నిరసన విరమించేది లేదని బాధితులు తేల్చి చెప్పారు. ఈ శాంతియుత నిరసన దీక్షకు పంచాయతీ ప్రజలు మద్దతు ఇచ్చారు.

ఈ ఆందోళన నేపథ్యంలో స్థానిక అధికారులు ఏ విధంగా స్పందిస్తారనేది కొయ్యూరులో చర్చనీయాంశంగా మారింది.

## పద్మనాభనగర్ లబ్ధిదారులకు ఇళ్ల తాళాల పంపిణీ



- విప్ గణబాబు, వేపాడ చిరంజీవి చేతుల మీదుగా తాళాలు అందజేత
- సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారుల ఆనందం
- ప్రభుత్వానికి, స్థానిక నాయకత్వానికి కృతజ్ఞతలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 17 :**పద్మనాభనగర్‌లో నిన్న అనివార్య కారణాల వల్ల ఇళ్ల తాళాలు అందుకోలేకపోయిన లబ్ధిదారులకు ఈరోజు ఉదయం విశాఖ పశ్చిమ నియోజకవర్గ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు కార్యాలయంలో ప్రత్యేకంగా ఇళ్ల తాళాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వ విప్ గణబాబుతో కలిసి మిగిలిన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. తాళాలు అందుకున్న లబ్ధిదారులు తమ జీవితకాల సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, స్థానిక ప్రజాప్రతినిధులు గణబాబు, వేపాడ చిరంజీవి గార్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ, సొంతింటి తాళాలు అందుకుంటున్న లబ్ధిదారుల ఆనందమే ప్రభుత్వానికి నిజమైన విజయమని అన్నారు. ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులతో కలిసి నాయకులు ఫోటోలు దిగుతూ వారి ఆనందాన్ని పంచుకున్నారు.

# పలు ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన ఏటిడబ్ల్యుఓ.

**గుమ్మలక్ష్మీపురం జూలై 17 పెన్ పవర్.**మండలంలో పలు ఆశ్రమ పాఠశాలను శుక్రవారం నాడు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి (ఏటీడబ్ల్యుఒ)ఓరజిని,ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ మేరకు ఏటిడబ్ల్యుఓ రజిని,మాట్లాడుతూ,రేగిడి,గొరద,బీరుపాడు,గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశానన్నారు.అన్ని పాఠశాలల్లో పరిసరాలు,కిచెన్,డార్మెంటరీ,తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చామన్నారు,ముఖ్యంగా రేగిడి గిరిజన ఆశ్రమం బాలికల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.తరగతి గదులకు వెళ్లి వారి చదువుల గురించి విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు.పదో తరగతి విద్యార్థులతో ఎఫ్.ఎల్.ఎన్ ప్రోగ్రాం పై వివరించి పలు సూచనలు ఇచ్చారు.ప్రతి పాఠశాల డార్మెంటులను పరిశీలించి వసతి గృహ వార్డులతో మాట్లాడి,విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎట్టి పరిస్థితుల్లో మెనూ ప్రకారమే విద్యార్థులకు ఆహారం అందించాలని ఈ విషయంపై ఎవరు అతిక్రమించిన తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రజిని అన్నారు.



# ఆనందగజపతిరాజు సేవలు చిరస్మరణీయం

* సింహాచలం దేవస్థానంలో 76వ జయంతి ఘనంగా నిర్వహణ
* ప్రతిభావంతుడైన విద్యార్థికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందజేత



సింహాచలం, పెన్ పవర్, జూలై 17 : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం పూర్వ ధర్మకర్తల మండలి చైర్మన్, ప్రముఖ విద్యావేత్త, కీర్తిశేషులు డా. పూసపాటి ఆనందగజపతిరాజు 76వ జయంతిని శుక్రవారం సింహాచలం దేవస్థానం పరిపాలన భవనంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మధుపాడ సన్యాసిరావు, కరక దేముడు, అధికారులు, ఉద్యోగులు కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ ఈవో జల్లేపల్లి వెంకటరావు, డా. ఆనందగజపతిరాజు విద్యావేత్తగా, సాంస్కృతిక పరిరక్షకుడిగా, సింహాచలం దేవస్థానం అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడిగా కొనియాడారు. ధర్మకర్తగా ఆయన సేవలు ఆలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సింహాచల క్షేత్ర మహిమ, చరిత్ర, సంప్రదాయాలకు సంబంధించిన అనేక సాహిత్య గ్రంథాల ప్రచురణకు ఆయన చేసిన కృషి వల్ల భక్తులకు అమూల్యమైన ఆధ్యాత్మిక సంపద అందుబాటులోకి వచ్చిందని గుర్తుచేశారు. డా. ఆనందగజపతిరాజు స్మారకార్థం ప్రతి ఏడాది అందజేస్తున్న విద్యా ప్రోత్సాహక బహుమతిలో భాగంగా, దేవస్థానం సంస్కృత ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతుడైన విద్యార్థికి రూ.5 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈవో జల్లేపల్లి వెంకటరావు, ధర్మకర్తల మండలి సభ్యులు మధుపాడ సన్యాసిరావు, కరక దేముడు సంయుక్తంగా విద్యార్థిని, వారి తల్లిదండ్రులను అభినందించి బహుమతిని ప్రదానం చేశారు. ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేందుకు దేవస్థానం నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి వాడ్రేవు రమణమూర్తి, ఇన్‌చార్జి డిప్యూటీ ఇంజనీర్ రామరాజు, పర్యవేక్షకులు కంచి మూర్తి, సత్యవాణి, రాజ్యలక్ష్మి, గాయత్రి, రమణ, మూలవాసు, వేదపండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డా. పూసపాటి ఆనందగజపతిరాజు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఆయన సేవలను స్మరించుకోవడంతో పాటు విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించే వేదికగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంది.






## ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



గాజువాక :పెన్ పవర్ , జూలై 17 నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠాను గాజువాక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గాజువాక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైమ్ ఏసీపీ వెంకట్రావు, క్రైమ్ సౌత్ సబ్ డివిజన్ సీఐ జి.డి. బాబు తెలిపారు .

పెద్దాడ రాజకుమార్, పాంగి లక్ష్మణ్, సునీల్ కారతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నట్లు , నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన మొత్తం 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు .నగరంలో వాహనాల చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, విస్తృత తనిఖీలు కొనసాగిస్తున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి కేసులో తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ హరికృష్ణ, ఏఎస్ఐ శ్రీనివాసరావు, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీష్టి వరల్డ్ స్కూల్‌లో పాఠశాల విద్యార్థి నాయకత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జులై17 :**
ఉక్కునగరం సెక్టర్ 11 శ్రిష్టి వరల్డ్ స్కూల్లో 2026--27 విద్యా సంవత్సరానికి జూనియర్ మరియు సీనియర్ స్టూడెంట్ కౌన్సిల్ ఇన్వెస్టిచర్ (ప్రమాణ స్వీకార) కార్యక్రమం పాఠశాల మైదానంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.పాఠశాలలోని నాలుగు హౌస్‌లు అయిన స్వయం, స్వేచ్ఛ, శౌర్య, స్మృతికి చెందిన నూతన విద్యార్థి నాయకులను ప్రజాస్వామ్య పద్ధతిలో బాలబాలికలందరూ ఓటింగ్ ద్వారా ఎన్నుకోబడ్డారు. ఎన్నుకోబడ్డ విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు, సాష్‌లు ప్రదానం చేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం విద్యార్థి నాయకులు తమ పదవులకు తగిన విధంగా నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో విధులు నిర్వహిస్తామని ప్రమాణ చేశారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ పి. సుశీలా రాణి, అసిస్టెంట్ డైరెక్టర్ ఈ.చంద్రిక, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపల్ డి.కిరణ్, ఔట్‌రీచ్ హెడ్ రాధా శ్రీనివాస్, చీఫ్ అకాడమిక్ హెడ్ పి.ఎన్.వి.కె. సంతోష్ కుమార్ హాజరై నూతనంగా ఎన్నుకోబడిన విద్యార్థి నాయకులను అభినందించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ పి. సుశీలా రాణి మాట్లాడుతూ, “నాయకత్వం అనేది ఒక పదవి మాత్రమే కాదని , బాధ్యత, నిజాయితీ, సేవాభావం,



క్రమశిక్షణతో తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని” విద్యార్థి నాయకులకు సూచించారు.

అతిథులు మాట్లాడుతూ విద్యార్థి నాయకులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పాఠశాల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

దేశభక్తి గీతంతో కార్యక్రమం ముగియగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో కిచెన్ గార్డెన్

**స్వచ్ఛమైన పోషక విలువలున్న ఆహారాన్ని విద్యార్థినులకు అందించేందుకు కిచెన్ గార్డెన్.**

**గుమ్మలక్ష్మీపురం జులై 17 పెన్ పవర్.** గుమ్మలక్ష్మిపురం మండలం రేగిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో కిచెన్ గార్డెన్.ఈ సందర్భంగా రేగిడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సురేష్ మాట్లాడుతూ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్నామని ఈ గార్డెన్లో ప్రకృతి సిద్ధంగా అన్ని రకాల కూరగాయలు పెంపకం చేపట్టి వాటిని విద్యార్థుల భోజనంలో వినాయకుస్తున్నామన్నారు.తద్వారా స్వచ్ఛమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించేందుకు వీలుగా ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్.డబల్.ఓ జయలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 66 వార్డ్ లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



**గాజువాక :పెన్ పవర్ ,జులై 17**
జీవీఎంసీ 66 వార్డులో కైలాష్ నగర్ ప్రాంతంలో, పరిశుభ్రతపై, ఫ్రైడే డ్రైడే రూపంగా ప్రతి గడపకు వెళ్లి అవగాహన కల్పించారు , డ్రమ్ముల్లో నిల్వ నీరు ఉంచటం, పూల కుండీల్లో నిలవ నీరు ఉంచటం, ఫిష్ అక్వేరిములు పరిశుభ్రతగా చూడటం, పనికిరాని పనిముట్లు ని ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉంచకూడదని , మలేరియా,డెంగ్యూ ఇలాంటివి ఆరోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని , ప్రతి శుక్రవారం డ్రైడేగా ప్రతి గృహిణి కూడా పాటించాలని, ప్రతి గృహానికి అవగాహన కల్పించారు . వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు గోమాడ వాసు, వార్డు హెల్త్ డిపార్ట్మెంట్ సభ్యులతో వార్డ్ లో పర్యటించారు .

## సుకన్య సమృద్ధి యోజన తో గ్రామీణ బ్యాంకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం.

బాధితునికి చెక్ అందిస్తున్న బ్యాంకు సిబ్బంది...




**కొయ్యూరు,పెన్ పవర్ జూలై 16:** అనారోగ్యంతో మృతి చెందిన కొవ్వూరు సత్యవతికి కొయ్యూరు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలరస్ మేనేజర్ సి హెచ్ భాను ప్రకాశ్ పి ఎం జెజెబివై 2 లక్షల రూపాయలను బీమా నగదు ను అందజేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యూరు మండలంలోని మర్రివాడ పంచాయితీ దొడ్డవరం కు చెందిన కోపూరు సత్యవతి అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు.ఆమె గత కొంతకాలం క్రితం గ్రామీణ బ్యాంకు లో అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన కింద నమోదు చేసిన నేపథ్యంలో ఆమె అనారోగ్యంతో మృతి చెందిన సమాచారాన్ని కొందరు సామాజిక కార్యకర్తలు బ్యాంకు కు తెలియజేశారు. దీంతో ఆమె కు ఆ పథకం ద్వారా రూ. 2లక్షల రూపాయిలు మంజూరు అయ్యింది.వీటిని చెక్ ద్వారా బ్యాంకు మేనేజర్ సి హెచ్ భాను , బ్రాంచ్ సిబ్బంది ఆశాలతా బిజినెస్ కరస్పాండెంట్ గోపాలరావు ఎస్ ఎస్ టి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కాన్సిలర్ శోభన్బాబు, తదితరులు కలిపి ఆ చెక్ ను బాధిత సభ్యులు కృష్ణా కు అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు అక్షరాస్యత కేంద్రం సొసైటీ పర్ సభ్యులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమలకు టెంపుల్ టౌన్ హోదా.. సీఎం ముందుకు ఎమ్మెల్యే బండారు ప్రతిపాదన





**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే బండారు**

**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 17:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రాన్ని రాష్ట్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈ సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూపొందించిన సమగ్ర ప్రణాళికను ముఖ్యమంత్రికి అందజేశారు. క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో రహదారులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి, యాత్రికుల విశ్రాంతి కేంద్రాలు, క్యూ కాంప్లెక్స్‌లు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. టెంపుల్ టౌన్‌గా అభివృద్ధి చేస్తే ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు లభించడంతో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎమ్మెల్యే వివరించినట్లు తెలిసింది.

అదేవిధంగా వాడపల్లి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతి కల్పించే ఉద్దేశంతో ఆలయ ప్రాంగణంలో శ్రీనివాసం--2 వసతి గృహ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ ప్రతిపాదనపై టీటీడీతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాడపల్లి క్షేత్ర అభివృద్ధి ద్వారా కోనసీమ జిల్లాలో ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని, రాష్ట్రంలో ప్రముఖ వైష్ణవ క్షేత్రాల సరసన వాడపల్లి ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తన వినతిపత్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని, ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందించే దిశగా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

# గ్రామాల అభ్యుదయ మే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూలై 17:** గ్రామాల అభ్యుదయమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం, పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో శుక్రవారం పట్టాదారు పాసు బుక్కుల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు భారీగా నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. కొత్త పెన్షన్లపై ప్రజల్లో ఉన్న సందేహాలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని చెప్పారు.

గత ప్రభుత్వం ఎన్నికల ముందు మాత్రమే కొత్త పెన్షన్లు ఇచ్చిందని విమర్శించారు. తల్లి వందనం పథకం కింద అల్లంపురం గ్రామ ప్రజలకు ఏడాదికి రూ. 82.95 లక్షలు అందుతున్నాయని తెలిపారు. ఆటో నేస్తం పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 355 మంది రైతులకు రూ. 1.40 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీగా 258 మంది రైతులకు రూ. 30.09 లక్షలు పంపిణీ చేశామని తెలిపారు.

గ్రామంలో కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు. ప్రభుత్వ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో చర్చలు జరగాలని పిలుపునిచ్చారు.

కుల, మతాలకు అతీతంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి వీమ్మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ చొరవతో రూ. 2 కోట్లతో డయాలసిస్ కేంద్రం మంజూరైందని తెలిపారు.

గ్రామ రహదారుల అభివృద్ధికి అదనంగా నిధులు కేటాయించారని చెప్పారు.

జల్ జీవన్ మిషన్ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కేంద్ర ప్రభుత్వం బీబీఆర్‌ఎంబీ కింద రూ. 7,787 కోట్ల నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 3.30 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతిపక్షం అభివృద్ధిపై కాకుండా వ్యక్తిగత విమర్శలకే పరిమితమైందని ఆరోపించారు.

గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు, అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

జగన్ మోహన్ రెడ్డి ప్రజలను కుల, మతాల పేరుతో విభజించే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. భూ హక్కుల చట్టాలు, పాస్‌బుక్ల వ్యవహారంలో గత ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు.

చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పోలవరం, అమరావతి అభివృద్ధిపై దృష్టి సారించిందని చెప్పారు. గత ఐదేళ్లలో అమరావతి అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలు, సోషల్ మీడియాలో వేధింపుల రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. రైతు భరోసా, ఎన్టీఆర్ భరోసా, ఆటో నేస్తం, పెన్షన్ల వంటి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని అన్నారు.

ఆక్వా రైతుల సమస్యలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆక్వా రంగం కుదేలైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ల సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో దూసుకుపోతుందని, దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డులకు ఉంగుటూరు మండలం నుంచి ఎనిమిది మంది ఎంపిక





**పెన్ పవర్ । ఉంగుటూరు । జులై 17:** పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న షైనింగ్ స్టార్ అవార్డులకు ఉంగుటూరు మండలం నుంచి మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ విభాగంలో నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ విద్యార్థిని దండండి జ్యోతి 954 మార్కులు సాధించి అవార్డుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బెజగం వెంకట శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 20న ఏలూరులో నిర్వహించే కార్యక్రమంలో ఆమెకు ప్రశంసాపత్రం, మెడల్‌తో పాటు రూ. 20 వేల నగదు బహుమతి అందజేయనున్నారు. ప్రస్తుతం జ్యోతి నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం (కంప్యూటర్స్) కోర్సులో చేరి విద్యను కొనసాగిస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు ఏడుగురికి అవార్డులు

ఉంగుటూరు మండలంలోని బాదంపూడి జడ్పీ ఉన్నత పాఠశాల, గొల్లగూడెం సూర్య స్కూల్, చేబ్రోలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం ఏడుగురు పదో తరగతి విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు.

వీరిలో బాదంపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్. ప్రశాంత్, గొల్లగూడెం సూర్య స్కూల్ విద్యార్థులు అనపర్తి భవ్య, ముళ్లపూడి నిహారిక అవార్డుకు ఎంపిక కావడం పట్ల సూర్య స్కూల్ నిర్వాహకులు వేములపల్లి దుర్గా చైతన్య, వేములపల్లి సుధీర్ అభినందనలు తెలిపారు. ఇతర ఎంపికైన విద్యార్థులకు కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.





## ఏపీ నిట్ లో పీహెచ్‌డీ, ఎంటెక్ విద్యార్థులకు మానసిక శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమం







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ జూలై 17:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఐటీ) లోని పీహెచ్‌డీ, ఎంటెక్ విద్యార్థులకు మానసిక శ్రేయస్సు అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ శ్రీవాణి టేకి మాట్లాడుతూ విద్యా, పరిశోధనా రంగాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచాలంటే వృద్ధి దృక్పథం (గ్రోత్ మైండ్‌సెట్) ను అలవరుచుకోవటం ఎంతో ముఖ్యమని తెలిపారు. విజయవంతమైన జీవితానికి సానుకూల ఆలోచనా విధానం, నిరంతర అభ్యాసం, పట్టుదల ఎంతో కీలకమని తెలిపారు. గ్రోత్ మైండ్‌సెట్ ను ఓర్పు, కృషి, నిరంతర శ్రమ, సానుకూల వైఖరి, ప్రేరణ, క్రమశిక్షణ వంటి విలువల ద్వారా పెంపొందించుకోవచ్చని చెప్పారు. పరిశోధనలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవడం, వైఫల్యాలను విజయానికి మెట్టుగా భావించి ముందుకు సాగడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవటం వంటి విషయాలు గురించి వివరించారు. మరో సైకాలజిస్ట్ లంక మైత్రి "ఇంపోస్టర్ సిండ్రోమ్‌ను అధిగమించడం అనే అంశంపై మాట్లాడారు. మానసిక శ్రేయస్సే పరిశోధనల్లో విజయానికి బలమైన పునాది అని తెలిపారు. పరిశోధకుల్లో కనిపించే ఆత్మన్యూనత భావం, తమ సామర్థ్యాలపై అనుమానాలను అధిగమించే పద్ధతులు, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవడం, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడటం వంటి అంశాల గురించి తెలియజేశారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భావోద్వేగ స్థైర్యం, పరిశోధనలో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. అనంతరం పిహెచ్డి ఎంటెక్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

## జాతీయ స్థాయిలో సీఎంఏ క్యాట్ పరీక్షలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించిన వంజరపు దీపక్



**పెన్ పవర్, ఉంగుటూరు, జూలై 17:** ఉంగుటూరు మండలం బాదంపూడికి చెందిన వంజరపు దీపక్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సీఎంఏ క్యాట్ అర్హత పరీక్షలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. అకౌంటింగ్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, బిజినెస్ కాస్ట్ అకౌంటింగ్ రంగాల్లో కెరీర్ ప్రారంభించాలనుకునే విద్యార్థుల కోసం నిర్వహించే ఈ అర్హత పరీక్షను ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది.

దీపక్ సాధించిన ఈ అరుదైన విజయంతో ఆయన చదువుతున్న విద్యాసంస్థతో పాటు తల్లిదండ్రులు, స్వగ్రామం బాదంపూడికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఆయన ప్రతిభపై తణుకులోని విద్యాసంస్థ యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా శుక్రవారం నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దీపక్‌ను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో ఈ ఘనత సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దీపక్‌ను అభినందించిన వారిలో శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి తదితరులు ఉన్నారు.

## జగదాంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే పునర్ నిర్మించాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జులై 17 ;** స్థానిక శ్రీ జగదంబ అమ్మవారి ఆలయం ఉన్నచోటే నూతన పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, గ్రామ పెద్దలు తీర్మానించారు. శుక్రవారం దేవాదాయశాఖ ఈవో టి లక్ష్మి, శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయం సూపర్డెంట్ కే రంగారావు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం విషయమై ఏర్పాటు చేసిన గ్రామసభలో గ్రామస్తులు ,గ్రామ పెద్దలు తన తీర్మానాన్ని తెలియజేశారు. అమ్మవారి ఉత్సవాలు 69 సంవత్సరాలుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారని అధికారులకు విన్నవించారు. అమ్మవారిని వేరేది చోటకు తరలించి ఆలయం నిర్మించడం అంటే గ్రామస్తులకు తీవ్ర మనోవేదన మిగల్చడమే అవుతుందని గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆలయం చోట నూతన ఆలయాన్ని నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యం అవుతుందని సంతకాల సేకరణతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఆలయ ఈవో టి లక్ష్మి మాట్లాడుతూ గ్రామస్తులు సూచించిన విషయాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావు, గడ్డ మణుగు సత్యనారాయణ, చాట్రాతి ప్రసాద్ చాట్రాతి భవాని శేఖర్,కోరుకొండ జనార్దన్ రావు, కోరుకొండ రామకృష్ణ, కోరుకొండ సూరిబాబు, కక్కిరాల చక్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా వైసీపీ కార్యాలయంలో ముద్రగడ పద్మనాభం నివాళులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 17:** కాపు ఉద్యమనేత,మాజీ మంత్రి వర్యులు ముద్రగడ పద్మనాభం మృతి పార్టీకి తీరని లోటని వై సి పి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ అన్నారు. వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి రూరల్ నియోజకవర్గం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ముద్రగడ కుటుంబానికి అండగా ఉంటామని వై.యస్ జగన్ భరోసా ఇవ్వడం ఆ కుటుంబంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. సిద్ధాంత బద్దంగా అలుపెరగక పోరాడిన నాయకుడిగా ముద్రగడ చరిత్రలో నిలుస్తారని అన్నారు. అంత్యక్రియలలో రాజకీయాలు చేయాలని చూసిన కూటమి ప్రభుత్వం పై రాష్ట్ర కాపు జాతి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నక్క రాజబాబు, గిరిజాల బాబు యాదల స్టాలిన్, ముద్దాల అను, బొప్పన సుబ్బారావు ఆచంట కళ్యాణ్ డబ్బింగ్ రమేష్ తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి శ్రీను,చాప రాజా రుక్యా సయ్యద్ సింహాద్రి రామలక్ష్మి షేక్ సమీరా కేపీ నాయుడు,దాసరి శివ, చొల్లంగి సత్యగిరి కొల్లి వెంకటరత్నం దాసరి ధర్మ ఓదురి రామకృష్ణ, ,ఆరిగేలా భాష కుప్పల రాంబాబు కోటిపల్లి రవి కాతేటి ఏసు, జల సత్యనారాయణ, సాక సతీష్,సంగీత రవితేజ,ఆకుల సుధాకర్, జీ.పీ.ఆర్ నాయుడు, కామిరెడ్డి పెద్ద కాపు, చేదులూరి ,ఉలిమి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# ఎస్సీ విద్యార్థులకు వ్యక్తిగత ఖాతాల్లో తల్లికి వందనం జమ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 17:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద ఈ నెల 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. 22న ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా విద్యార్థుల తల్లితండ్రుల ఖాతాలో జమ కు శ్రీకారం చుట్టడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత శాఖ అధికారి మహ్మద్ గయాజుద్దీన్ శుక్రవారం సూచించారు.

గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, 2026--27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, పాలిటెక్నిక్, గురుకుల విద్యాసంస్థలు లేదా కార్పొరేట్ కళాశాలల్లో చేరిన ఎస్సీ విద్యార్థులుఅర్హులన్నారు.ఈ పథకం కింద తల్లుల ఖాతాలకు కాకుండా విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు లేదా పోస్టాఫీస్ ఖాతాల్లోనే ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు వ్యక్తిగత ఖాతా లేని విద్యార్థులు వెంటనే బ్యాంకు లేదా పోస్టాఫీస్‌లో ఖాతా తెరిచి, ఆ ఖాతాకు ఆధార్ నంబర్‌ను ఎన్ పి సి ఐ ద్వారా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయినట్లయితే "తల్లికి వందనం" పథకం కింద మంజూరయ్యే మొత్తం నేరుగా విద్యార్థి ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు డి.పి.యం.యు కె. కిరణ్ ను 9948868862 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఉభయగోదావరి బీ ఈ డీ కళాశాలల యాజమాన్య అధ్యక్షుడిగా డాక్టర్ బి. సువర్ణ కుమార్ ఎన్నిక

✷ హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఘన సత్కారం



**గోకవరం జూలై 17 :**--ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల బీఈడీ కళాశాలల యాజమాన్య సంఘంఅధ్యక్షుడిగా హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ డాక్టర్ బి.సువర్ణ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.విద్యారంగంలో ఆయన అందించిన సేవలు, కళాశాలల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఈ బాధ్యతలను అప్పగించినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా గోకవరం హన్నా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో కళాశాల సిబ్బంది,అధ్యాపకులు, విద్యార్థులు డాక్టర్ బి. సువర్ణ కుమార్‌ను సాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో ఉభయగోదావరి జిల్లాల్లో బీఈడీ విద్య మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.డాక్టర్ బి.సువర్ణ కుమార్ మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ,బీఈడీ కళాశాలల అభివృద్ధి,విద్యా ప్రమాణాలపెంపు,యాజమాన్యాల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వరరావు,ప్రసాద్,తులసి కుమారి,శ్రీను,రాజేష్,రాజు,శివరామకృష్ణ, వై.వి.ఎస్. నారాయణ,దుర్గాప్రసాద్,శ్రీకాంత్ తదితరులు పాల్గొని డాక్టర్ బి.సువర్ణ కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## భీమవరం, పాలకొల్లులలో ఈట్ స్ట్రీట్ లను ఏర్పాటు చేస్తాం,

✷ గూడెం ఈట్ స్ట్రీట్‌లో ప్రజల మధ్య అల్పాహారం స్వీకరించిన కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 17.** త్వరలో భీమవరం పాలకొల్లులలో ఈట్ స్ట్రీట్ లను ఏర్పాటు చేయటానికి కృషి చేస్తాను అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తన నిరాడంబరతను మరోసారి చాటుకున్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రముఖ ఫుడ్ కోర్ట్ 'ఈట్ స్ట్రీట్' వద్ద ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య ప్రజల మధ్య కూర్చుని ఆయన అల్పాహారం స్వీకరించి, టీ తాగారు. కేంద్రమంత్రి తమ మధ్యకు రావడం తోపాటు తమతో మమేకమై మాట్లాడటంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ?బిజెపి ఆధ్వర్యంలో జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్రలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఆ కార్యక్రమం ముగించుకుని తిరిగి భీమవరం వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తాడేపల్లిగూడెంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక ఈట్ స్ట్రీట్‌లో తోటి నాయకులతో కలిసి ఆయన సందడి చేశారు. ?ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీనియర్ బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

# భూముల ఫిర్యాదులపై ప్రభుత్వ ప్రామాణికాలు పాటించాలి




✷ తహసీల్దార్లు, ఆర్డిఓ లతో
✷ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 17 :**పిజిఆర్ఎస్ ద్వారా అందే భూమి సంబంధమైన ఫిర్యాదులపై ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక మార్గదర్శకాలను పారదర్శకంగా పాటిస్తూ సత్వర పరిష్కారాలను ప్రజలకు అందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ తహసీల్దార్లు, ఆర్డిఓ లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిజిఆర్ఎస్ లో అధికంగా నమోదౌతున్న ఫిర్యాదులపై రెవెన్యూ అధికారులకు ఒకేరీతిలో, న్యాయబద్ధమైన, సత్వర పరిష్కారాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన పిజిఆర్ఎస్ లో అధిక సంఖ్యలో అందుతున్న ఆర్ఓఆర్, అసైన్మెంట్ సంబంధిత అంశాలు, ఆక్రమణ, లాండ్ గ్రాబింగ్, రి సర్వేలకు సంబంధించిన ఫిర్యాదులపై అర్జీదారులు పదేపదే తిరగాల్సిన అగత్యాన్ని నివారించి, సంతృప్తికరమైన పరిష్కారాలను త్వరిత గతిన అదించేందుకు యూనిఫామ్ స్టాండర్డ్ గైడ్ లైన్స్ ప్రభుత్వం జారీ చేసిందని తెలిపారు. ఈ మార్గదర్శకాలను, వాటి మౌలిక స్ఫూర్తిని అధికారులు సమగ్రంగా అవగాహన చేసుకుని న్యాయ, చట్టబద్ధమైన పరిష్కారాలతో రెవెన్యూ శాఖ సేవల పట్ల ప్రజల్లో మరింత మెరుగైన సంతృప్తి స్థాయిని సాదించాలని జిల్లా కలెక్టర్ తహసీల్దార్లను, ఆర్డిఓలను కోరారు. ఆయా రెవెన్యూ అంశాల వారీగా అర్జీలపై అనుసరిచాల్సిన ప్రామాణిక విధి విధానాలను వివరించి, ప్రతి అర్జీని వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కారించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, డిఆర్ఓ ఎస్. భాస్కరరెడ్డి, ఆర్డిఓలు ఆర్. శివ రాముడు, కె.ఆనందరావు, సర్వే లాండ్ రికార్డుల ఏడి టి. వేంకటేశ్వరరావు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి



**సీతానగరం, పెన్ పవర్, జూలై 17:**వాతావరణంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకొనిఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం లేకపోవడంతో వరి సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయ శాఖ ఏఓ ఏ. గౌరి దేవి అన్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ సీతానగరం మండలంలోని రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు ఎల్ నినో ప్రభావం దృష్ట్యా వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వినియోగం తక్కువగా ఉండే జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.రైతులు తమ పొలాల పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె) లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా దిగుబడి మరియు ఆదాయాన్ని మెరుగుపరచుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏఓ గౌరీ దేవి తెలిపారు.

# 24, 25 డివిజన్లలో 'మన వార్డులో -- మన ఆదిరెడ్డి'



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 17:**ప్రజల సమస్యలను వారి వద్దకే వెళ్లి పరిష్కరించా లనే లక్ష్యంతో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన "మన వార్డులో -- మన ఆదిరెడ్డి" కార్యక్రమం 24, 25 డివిజన్లలో జరిగింది. ముందుగా సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వాసు, ప్రజల సమస్యను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి ఎన్నికలో కూటమిపై ప్రజల విశ్వాసం పెరుగుతూనే ఉందన్నారు. ప్రజాప్రతి నిధులు చెప్పే ప్రతి సమస్య వెనుక ప్రజల ప్రయోజనమే ఉంటుందని అధికారులు గుర్తించా లన్నారు. . వార్డుల్లో తిరిగితే ప్రతి కుటుంబాన్ని కలుసుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. "మన వార్డులో -- మన ఆదిరెడ్డి" చేపట్టానని వివరించారు. నగర పారిశుద్ధ్యాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. 24, 25 డివిజన్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, పుష్కరాల నిధుల ద్వారా 25వ డివిజన్‌లో రూ.1.25 కోట్ల, 24వ డివిజన్‌లో రూ.3.25 కోట్ల అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు లభించాయన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోని టౌన్ హాల్‌ను తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, కందుకూరి వీరేశలింగం పంతులు గ్రంథాలయాన్ని పునరుద్ధరించామని తెలిపారు. నగరంలో మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శానిటేషన్, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 24, 25 డివిజన్లలో లో-వోల్టేజ్ సమస్యలు ఉంటే అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అని స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి కాశీ నివాసంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# విద్యార్థుల విజయానికి క్రమశిక్షణ , ఆరోగ్యం సమయపాలన ఎంతో అవసరం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 17:**ప్రముఖ నటులు, రచయిత, దర్శకుడు మరియు వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీ తనికెళ్ళ భరణి శుక్రవారం లోటస్ స్కూల్లో పాఠశాలలో 10 ,11 మరియు 12వ తరగతి విద్యార్థులతో "భావి భారత పౌరులతో మాటామంతీ" అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థుల విజయానికి క్రమశిక్షణ , ఆరోగ్యం సమయపాలన ఎంత అవసరమో తెలిపారు. అదేవిధంగా ప్రతి పిల్లల విజయాన్ని చూడటానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారని ఎన్నో త్యాగాలు చేస్తారని అటువంటి తల్లిదండ్రులను నొప్పించకుండా వాళ్లు గర్వించే స్థాయికి పిల్లలు ఎదగాలని ఆయన తెలిపారు. తదనంతరం పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ భరణి గారి లాంటి ప్రముఖులు మన పాఠశాలకు రావడం మన అదృష్టమని ఆయన నింపిన స్ఫూర్తి విద్యార్థుల్లో ఎప్పుడూ ఉండాలని, ఆయన కోరుకున్నట్లుగానే మీరందరూ భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ దేవిప్రియ మాట్లాడుతూ ఇటువంటి ఒక మంచి కార్యక్రమం ద్వారా మా పిల్లలను ఆశీర్వదించినందుకు భరణి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు షైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించిన స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు







**తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 17:**ధర్మవరంలోని స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 2026 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పోలిశెట్టి వర్షాంజలి 600 లకు 596 మార్కులు, బెల్లపుకొండ నయన వెంకట సత్య శ్రీ 600 లకు 593 మార్కులు సాధించారు. కొవ్వూరు నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన ఈ విద్యార్థులు ప్రభుత్వం నుండి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పేరిచర్ల పద్మ, స్కూల్ ఇన్ చార్జెస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. కొవ్వూరు మండలంలోని అత్యధిక ప్రతిభ కనబరచిన విద్యార్థులలో తమ విద్యార్థులు ఈ అవార్డుకు ఎంపికైనందుకు తల్లిదండ్రులు స్కూల్ యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ధనిశెట్టి భద్రరావు కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి,పెన్ పవర్,జులై,17:** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ భౌతిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న" ధనిశెట్టి భద్ర రావు" ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు కి చెందిన ప్రొఫెసర్ జి.నాగరాజు నేతృత్వంలో ధనిశెట్టి భద్ర రావు సమర్పించిన "థీసిస్ శీర్షిక: "డైఎలెక్ట్రిక్ డిస్పర్షన్ అండ్ డైపోలార్ రిలాక్సేషన్ డైనమిక్స్ ఇన్ రెడ్-లెడ్ మోడిఫైడ్ బిస్మత్ బోరేట్ గ్లాస్-సిరామిక్స్ కంటైనింగ్ కాపర్ అండ్ సిల్వర్ అయాన్స్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." ధనిశెట్టి భద్ర రావు " భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, అసోసియేట్ డీన్ . డా. ఏ.వానతి మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా.ధనిశెట్టి భద్ర రావు కు అభినందనలు తెలియజేశారు.

## అడ్డుకొండ భూమి పేద ప్రజలకే దక్కాలి

కర్నాకుల డిమాండ్.




**గండేపల్లి, పెన్ పవర్,జులై,17:** మల్లిసాల-కె.గోపాలపురం మధ్యలో ఉన్న 580 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు అయిన అడ్డుకొండ భూమి పేద ప్రజలకు దక్కాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడు కాకినాడ జిల్లా గండేపల్లి మండలం కే గోపాలపురం గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ భూమిపై ఆధారపడి రెండు గ్రామాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి పేదలు ఆధారపడి ఉన్నారని,ఈ భూమి కోసం అనేక దాడులు, కేసులు, నిర్బంధాలు అనుభవించారని ఆయన తెలిపారు.ఈ భూమిపై రెండు గ్రామాల ప్రజలకు హక్కు కల్పిస్తే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. గత 25 సంవత్సరాల కాలం నుంచి పోరాడుతున్న ప్రజలకు ఈ భూమి పై హక్కు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు,

ప్రభుత్వ పోరంబోకైన అడ్డుకొండ భూమి రెండు గ్రామాల ప్రజలకు దక్కేవరకు మా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కే. సతీష్, జిల్లా నాయకులు కే. రామలింగేశ్వరరావు,జాన్,గ్రామ నాయకులు పోచమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## తలుపులమ్మకు చీర సారెలు సమర్పించిన యనమల దివ్య



**పెన్ పవర్ ప్రతినిధి (తుని)** తలుపులమ్మ అమ్మవారికి ప్రభుత్వ విప్ యనమల దివ్య శుక్రవారం చీర సారెలు సమర్పించారు ఆషాడ మాస ఉత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దివ్య కు అధికారులు అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ లాంచనాలతో స్వాగతం పలికారు అర్చకులు వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేదాశీర్వచనం అందజేశారు అధికారులు అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారి శేషవస్త్రాన్ని ఎమ్మెల్యేకి అందజేశారు అనంతరం ఎమ్మెల్యే దివ్య అమ్మవారికి జరిపించిన కుంకుమ పూజలో శ్రీ ప్రకాష్ లయోలా శ్రీవిద్య భాష్యం శాంతినికేతన్ అచ్యుత మదర్ విద్యా సంస్థలకు చెందిన 1008 మంది విద్యార్థినులతో కలసి సువాసినీ పూజలో పాల్గొన్నారు భక్తిశ్రద్ధలతో పూజలు చేసారు తీర్థప్రసాదాలను స్వీకరించారు తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రాజేష్ చింతంనీడి అబ్బాయి కార్యనిర్వహణాధికారి పెన్మత్స విశ్వనాథరాజు ధర్మకర్తల మండల అధ్యక్షుడు పెంటకోట భాస్కర సత్యనారాయణ దూలం మాణిక్యం పరవాడ తాతబాబు అరిగెల నరసింహమూర్తి చిటికల శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# సేంద్రియ ఎరువుల వాడకంతో భూసార పరిరక్షణ కలుగుతుంది





రైతుల శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు

**గండేపల్లి, పెన్ పవర్, జూలై, 17:** ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ సాగుతో భూసార పరిరక్షణ చేయవచ్చునని రైతుల శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక అగ్రికల్చర్ అధికారిని జే లక్ష్మి ఆధ్వర్యంలో ఆత్మ బ్లాక్ పరిధిలోని గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం మరియు భూసార పరిరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో "శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం, భూసారాన్ని కాపాడే పద్ధతులు, తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే సాంకేతికతలపైమరియు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంటలకు పంట బీమా నమోదు అవశ్యకతను వివరంగా అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో పాల్గొన్న రైతులు అధికారులు వివరించిన అంశాలపై ఆసక్తి కనబరిచి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించి మంచి దిగుబడులు సాధించాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఏడిఏ, జి. శ్రీనివాస్గారు, డిఆర్సి ఏవో - డి.సంజయ్ , డాట్ సెంటర్ శాస్త్రవేత్త శర్మ ,మండల వ్యవసాయ అధికారిణి జె . లక్ష్మి , వ్యవసాయ విస్తరణ అధికారి.బలరామకృష్ణ, గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులు లావణ్య, జ్యోత్స్న, ప్రియాంక, ఎఫ్ పి ఓ , కుమార స్వామి,గ్రామ రైతులు పాల్గొన్నారు

## స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడకు ముస్లిం సోదరులు ఘన నివాళులు.

-ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని సమాధి వద్ద ప్రత్యేక ప్రార్ధనలు.






**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై, 17:** మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం నివాసానికి కిర్లంపూడి మండలంలోని ముస్లిం సోదరులు భారీగా సంఖ్యలో తరలివచ్చి ముద్రగడ ఇంటి ఆవరణలో ఉన్న ఆయన సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘన నివాళులర్పించడమే కాకుండా, ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కుల,మతాలకు అతీతంగా ప్రజల అభిమానాన్ని చూరగొన్న ముద్రగడ పద్మనాభం సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.అనంతరం ఆయన కుమారులు ముద్రగడ వీర రాఘవరావు (బాలు), ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ షాబుద్దీన్,ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా,షేక్ ఇబ్రహీం(ఐ జి), షేక్ కాలేషా,పలువురు కమిటీ సభ్యులతో పాటు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పంటల బీమాకు రైతులు నమోదు చేసుకోవాలి-ఏవో జె.లక్ష్మి

- ఖరీఫ్ 2026కు పీఎంఎల్బీవై అమలు.. వరికి రూ.760, ప్రత్తికి రూ.2000 ప్రీమియం



**గండేపల్లి , పెన్ పవర్, జూలై, 17:** రైతుల కోసం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బీవై) ఖరీఫ్/ సార్వా 2026 పంటల బీమా పథకం అమలు చేస్తున్నట్లు గండేపల్లి వ్యవసాయ అధికారిణి జె.లక్ష్మి తెలిపారు. బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులు బ్యాంకర్ల మినహాయింపుతో ప్రీమియం ద్వారా నమోదు పొందని చేసుకోవచ్చని, రుణాలు రైతులు సీఎస్సీ, మీ సేవ కేంద్రాల ద్వారా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంటల బీమా నమోదు కోసం రైతులు సాగు చేస్తున్న పంట, విత్తిన విస్తీర్ణానికి సంబంధించిన స్వీయ ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అలాగే ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్లో పీఎంఎఫ్ బీవై కింద దిగుబడి ఆధారిత పంటగా వరి, వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద ప్రత్తి పంటలకు బీమా వర్తిస్తుందని వివరించారు.కాకినాడ జిల్లాలో వరి పంటకు ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ప్రత్తి పంటకు ఇఫ్కో టోకియో కంపెనీలు బీమా సంస్థలుగా ఎంపికయ్యాయని తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.760 ప్రీమియం కాగా, నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉందన్నారు. ప్రత్తి పంటకు ఎకరానికి

నమోదు రూ. 2000 ప్రీమియంగా నిర్ణయించగా, జూలై 24లోపు చేసుకోవాలని కోరారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని పంటల బీమా నమోదు చేసుకోవాలని ఏవో జె.లక్ష్మి విజ్ఞప్తి చెసారు

## జగ్గంపేటలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 17:** జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలోని జగ్గంపేటలో శుక్రవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో బాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా చిన్న దోమ - పెద్ద ముప్పు, డెంగ్యూ వ్యాధి నివారణ - మనందరి బాధ్యత, ఆరోగ్యమే - మహాభాగ్యం అంటూ నినాదాలతో మానవహారం నిర్వహించారు. అనంతరం రాజపూడి పీహెచ్సీ వైద్యాధికారి పూజ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నివారణ గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శివ, పెద్దాపురం ఎస్ యుఓ సత్యనారాయణ, రాజపూడి పిహెచ్సి ఎంపీహెచ్ఈఓ ఉమా మహేశ్వరరావు, సూపర్వైజర్ శంకర్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొని డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.

## షైనింగ్ స్టార్ అవార్డుల్లో నవోదయ విద్యార్థుల ప్రతిభ





ముగ్గురికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

**కాజులూరు, పెన్ పవర్ జూలై 17:** 2025--26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు గొల్లపాలెం నవోదయ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ డి.వి.వి.ఎస్.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ,పదో తరగతి వార్షిక పరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు విద్యాశాఖ షైనింగ్ స్టార్ అవార్డులను ప్రకటించిందన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన గొల్లపల్లి గంగావర్షిత 583/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, డి.వి.వి.ఎస్.ధరణి ప్రణీత 574/600 మార్కులతో ద్వితీయ స్థానం,ఎస్. జాస్మిన్ దేశ్ 571/600 మార్కులతో మండలంలో నాలుగో స్థానం సాధించి షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారని వెల్లడించారు.ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,సహ విద్యార్థులు ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com